ఈనాడు కుమురం భీం

బుధవారం అక్టోబరు 23, 2024 — 5

వేడినీటి యంత్రం.. అట్టపెట్టెలో భద్రం

● మూడేళ్లుగా మూలకు చేరిన వైనం.. ఎస్సీ వసతి గృహాల్లో చన్నీటి స్నానాలే గతి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : చలికాలం వచ్చేసింది..అప్పుడే చలిగాలులతో వసతి గృహ విద్యార్థులు వణుకుతున్నారు. ఉదయం చల్లటి నీటి స్నానాలు చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేడి నీటి స్నానం కోసం మూడేళ్ల కిందట ఎస్సీ వసతి గృహాలకు ప్రభుత్వం సోలార్ యంత్రాలను సమకూర్చింది. కానీ వీటికి గత ప్రభుత్వం బిల్లులు ఇవ్వలేదని గుత్తేదారు సంస్థ ఎక్కడా బిగించలేదు. దీంతో అవి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. ఈసారైనా జిల్లా అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తెచ్చి విద్యార్థులకు వేడి నీటి వసతి అవకాశం కల్పిస్తారా అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో ఏడు ప్రీ, మూడు పోస్టు మెట్రిక్ ఎస్సీ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 503 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇందులో ఉండేవారు సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటూ వీటిలో వసతి పొందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని ఎనిమిది వసతి గృహాల విద్యార్థులకు ఒక్కో వేడినీటి యంత్రానికి రూ.60 వేల చొప్పున రూ.4.60 లక్షలతో కొనుగోలు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. వీటికి సంబంధించిన బిల్లులు అందలేదని సంస్థవారు బిగించకుండా వదిలేశారు. మొదట యంత్రాలను జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహం వద్ద ఉంచారు. గతేడాది ఇక్కడి నుంచి ఆరు వసతి గృహాలకు ఒక్కోటి చొప్పున తరలించారు. ప్రస్తుతం ఇక్కడే రెండు యంత్రాలు ఉన్నాయి. మూడేళ్లు అవుతున్నా.. ఎక్కడా వీటిని బిగించకపోవడంతో. . ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది.

జిల్లాలో ప్రీ మెట్రిక్ వసతి గృహాలు: 7
విద్యార్థులు: 394
పోస్టు మెట్రిక్ వసతి గృహాలు: 3
విద్యార్థులు: 109



వృథాగా సౌర యంత్రాలు



చలికాలంలో చన్నీటి స్నానం చేస్తున్న విద్యార్థులు (పాత చిత్రం)

స్పందించాల్సిన సమయమిదే..

చలి తీవ్రత పెరగక ముందే జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి యంత్రాలను బిగించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే ఈ ఏడు సైతం విద్యార్థులు చన్నీటి స్నానం చేయాల్సిన పరిస్థితి వస్తుంది. జిల్లాలోని ఎస్సీ వసతి గృహ విద్యార్థుల కోసం 400 వరకు కార్పెట్లు, బెడ్‌షీట్లు వచ్చాయి. వీటిని కొన్ని వసతి గృహాల్లో పంపిణీ చేసినా.. కొన్నిచోట్ల ఇంకా చేయాల్సి ఉంది. గతేడాది విద్యార్థులకు చలి నుంచి రక్షణకు స్వెటర్లు అందించారు. ఈ సారి అవి వస్తాయా? రావా? అన్న స్పష్టత లేదు.

ఏటా నిధుల కోసం నివేదిస్తున్నాం
సజీవన్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి

ఏటా బడ్జెట్ కోసం ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. నిధులు రావడంలేదు. వస్తే వసతి గృహాల్లో యంత్రాలు బిగించేలా చర్యలు తీసుకుంటాం. కార్పెట్లు, బెడ్‌షీట్‌లను అన్ని వసతి గృహాలకు అందించేలా చూస్తున్నాం.


వరికి తెగుళ్ల బెడద!

అన్నదాతలను చుట్టుముట్టిన సమస్యలు..



పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

దహెగాం, న్యూస్‌టుడే : గత యాసంగిలో తెగుళ్లకు తోడు మిల్లర్ల కోతలతో నష్టపోయిన అన్నదాతలు.. ఈ ఖరీఫ్‌లోనైనా వరి సాగు కలిసి వస్తుందనుకున్నా నిరాశే ఎదురవుతోంది. వరి పొట్ట దశకు చేరుకోగానే తెగుళ్లు సోకడంతో.. కాపాడుకునేందుకు పాట్లు పడుతున్నారు. అగ్గితెగులు, జింక్ లోపంతో పంట ఎర్రబారిపోవడంతో కుదేలవుతున్నారు. సాధారణంగా పంట పొట్టదశలో పురుగుమందులు అవసరమవుతాయి. కానీ ఈ సారి ఎన్నిసార్లు పిచికారీ చేసినా ఎర్ర తెగుళ్లు, తెల్ల పురుగులు పోవడం లేదు.



జిల్లాలో 56,856 ఎకరాల్లో వరి సాగవుతోంది. ఎకరం సాగుకు ఖర్చు రూ.17 వేల నుంచి రూ.20 వేల వరకు అవుతుండగా తెగుళ్ల సోకడంతో మందులను రెండు, మూడు సార్లు పిచికారీ చేయాల్సి వస్తోంది. దీంతో అదనంగా రూ.పది పదిహేను వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా నారు వేసే క్రమంలో అదనంగా భారం పడిందని, ఈ ఖరీఫ్‌లోనూ పెట్టుబడులు వచ్చేలా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సలహాలు అందించే వ్యవసాయ విస్తరణ అధికారులు పంటల పరిశీలనకు రావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

వాతావరణ మార్పులతో సమస్య

వాతావరణంలో మార్పుల కారణంగా వరి పంటకు అనేక సమస్యలు తావిస్తున్నాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో అనుకున్న స్థాయిలో దిగుబడి రాదనే ఆందోళన చెందుతున్నారు. ఇలాగే ఎండల తీవ్రత కొనసాగుతుంటే పంటలో ఎదుగుదల తగ్గుతుందని చెబుతున్నారు. సూచనలు,

అధికారులు అవగాహన కల్పించాలి
గొండె అంజన్న, గిరవెల్లి రైతు

వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాలకు వచ్చి వెళుతున్నారు. పంట పొలాలను పరిశీలించడం లేదు. మందులు పిచికారి చేసినా పంటకు రోగం పోవడం లేదు. కొందరు రైతులు ఇక్కడి మందులు పనిచేస్తలేవని బెల్లంపల్లి, కాగజ్‌నగర్ పట్టణాలకు వెళ్లి మందులు కొని తెచ్చుకుంటున్నారు. అధికారులు ఇప్పటికైనా పంటలను పరిశీలించి అవగాహన కల్పించాలి.

సన్న రకానికి అధికంగా..
జన్నె మల్లేష్, గిరవెల్లి రైతు



పదెకరాల్లో సన్న రకం వరి సాగు చేశా. ఎండల తీవ్రతతో పంట రోగం వస్తోంది. వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుని మందులు పిచికారీ చేస్తామంటే వారు సరిగ్గా రావడం లేదు. ఎరువుల దుకాణానికి పోతే ఏవో అంటగడుతున్నారు. పెట్టుబడి పెరుగుతోంది. సన్నరకానికి అధికంగా రోగం వస్తోంది. అధికారులు పంటలను పరిశీలించి అవగాహన కల్పించాలి.

యూరియా మోతాదును తగ్గించుకోవాలి
రామకృష్ణ వ్యవసాయాధికారి

రసాయనిక ఎరువులను రైతులు ఎక్కువగా వాడుతున్నారు. సేంద్రియ ఎరువులు వాడకపోవడంతో భూసారం తగ్గి తెగుళ్లు సోకుతున్నాయి. వరి ఎర్రబడినప్పుడు యూరియా వేయకుండా వ్యవసాయాధికారుల సలహా తీసుకుని మందులను పిచికారీ చేసుకోవాలి.

ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాల అమలు



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, చిత్రంలో వివిధ శాఖల అధికారులు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : నీతి ఆయోగ్ ద్వారా జిల్లాలో అమలవుతున్న ఆకాంక్షిత కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్లు అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పేర్కొన్నారు. మంగళవారం దిల్లీ నుంచి నీతి ఆయోగ్ కింద జిల్లాలో చేపడుతున్న పనులపై ఎన్ఐడీసీ జిల్లా డైరెక్టర్ సెంట్రల్ ప్రబారి రజత్‌కుమార్.. వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి డీఎంహెచ్‌వో తుకారం, డీఆర్‌డీవో దత్తారావులతో కలిసి పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యం, పోషకాలు, వ్యవసాయ సాగునీరు, నైపుణ్యత అభివృద్ధి, ఆర్థిక సహకారం, విద్య, వైద్యం ఆరు అంశాలపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. జిల్లాకు మంజూరైన రూ.మూడు కోట్లతో 279 అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు రంగులు, పిల్లలను ఆహ్లాదపరిచేలా చిత్రాలు వేయించామని, తాగునీటి వసతి, మూత్రశాలల నిర్మాణం, న్యూట్రీగార్డెన్, విద్యుత్తు వంటి వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. పాఠశాల అభివృద్ధి పనులు, మినీ అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. మండల సమాఖ్య భవనాల నిర్మాణం, బల్క్ మిల్క్ సెంటర్, కట్టు శిక్షణ కేంద్రాలు, డైరీ మిల్క్ సెంటర్, జంతు జనన నియంత్రణ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. సమావేశంలో అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, మండల విద్యాధికారి మర్యాల ఉదయ్‌బాబు, ఎల్‌డీఎం రాజేశ్వర్ జోషి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఠాణాలో ఓపెన్ హౌస్!



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కొమురయ్య

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల త్యాగం మరువలేనిదని ఎస్సై కొమురయ్య అన్నారు. మంగళవారం పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని.. పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పోలీస్ స్టేషన్ నియమాలు, నూతన నేరచట్టాలపై అవగాహన కల్పించారు. దేశ రక్షణకు, సమాజంలో శాంతిభద్రతలు కాపాడటంలో విధినిర్వహణలో ప్రాణత్యాగం చేసిన ప్రతి పోలీసును స్మరించుకోవాలని పేర్కొన్నారు. ప్రజలు ప్రశాంతంగా ఉండేలా పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

పోరాట యోధులను స్మరించుకుందాం

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : పోరాట యోధులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. మంగళవారం మండలంలోని రౌతసంకెపల్లిలో ఆదివాసీల ఆరాధ్య దైవం కుమురంభీం జయంతి, ఆయన అనుచరుడు ఎడ్ల కొండు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీ కరుణాకర్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, భీం మనవడు సోనేరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు అరిగెల నాగేశ్వర్‌రావు తదితరులతో కలిసి పాల్గొని మాట్లాడారు. మొదటగా సంప్రదాయం ప్రకారం ఆదివాసీలు పూజలు నిర్వహించి జెండాలు ఆవిష్కరించారు. అనంతరం భీం, కొండుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కుల కోసం భీం చేసిన పోరాటం సదా స్మరణీయమన్నారు. ఆయనకు సహకరించిన ఎడ్ల కొండు జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఆదివాసీల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, పీఏసీఎస్ ఛైర్మన్ అలీబిన్ అహ్మద్, ఆదివాసీ సంఘాల సభ్యులు కొట్నాక విజయ్ కుమార్, అర్జుమాస్టర్, మాజీ సర్పంచి కిష్టయ్య, ఎడ్ల బక్కు, రాము, సీతారాం, గ్రామస్థులు పాల్గొన్నారు.

రుచులు ఆస్వాదించేలా.. లాభాలు ఆర్జించేలా..

● ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ల ద్వారా మహిళలకు ఉపాధి



న్యూస్‌టుడే, చెన్నూరు, నస్పూర్ : నోరూరించే మిఠాయిలు.. ఘుమఘుమలాడే పిండి వంటకాలు.. సంప్రదాయ రుచులతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో క్యాంటిన్లు ఆహ్వానం పలుకుతున్నాయి. మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారిని ఆర్థికాభివృద్ధి వైపు ప్రోత్సహించేలా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. నిర్వహణ సామర్థ్యం ఉన్న స్వయం సహాయక సంఘాలను గుర్తించి శిక్షణ ఇచ్చి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. రూ.8 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు దశల వారీగా రుణాలు మంజూరు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, మంచిర్యాల కలెక్టరేట్ ప్రాంగణాల్లో, లక్సెట్టిపేటలోని ఐకేపీ కార్యాలయం ఆవరణలో ఇప్పటికే స్వయం సహాయ సంఘాల ఆధ్వర్యంలో క్యాంటిన్లు వెలిశాయి.

రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటుకు కార్యాచరణ

ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతాలు, ఆలయాలు, మార్కెట్లు, ఆర్టీసీ బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించారు. అందుబాటులో ఉండే ధరలకు నాణ్యమైన ఆహార పదార్థాలు లభిస్తాయి. మహిళా సంఘం సభ్యులతో ఆహార పదార్థాలు, పిండి వంటలు, మిఠాయిలు, పచ్చళ్లు, పండ్ల రసాలు, సంప్రదాయ వంటకాలు తయారు చేయించి విక్రయాలు చేపడుతున్నారు.

ప్రతిపాదిత ప్రాంతాలివే..

- ఆదిలాబాద్ : కోర్టు ఆవరణ, మున్సిపల్ కార్యాలయం, కలెక్టరేట్
- నిర్మల్ : ఏరియా ఆసుపత్రి, మెడికల్ కాలేజీ, మాతా శిశు ఆసుపత్రి
- ఖానాపూర్ : తహసీల్దారు కార్యాలయం, ఆసుపత్రి ఆవరణ, మున్సిపల్ కార్యాలయం
- మంచిర్యాల : మున్సిపల్ కార్యాలయం, మాతా శిశు ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం, బస్టాండ్
- భైంసా : ఏరియా ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం
- కుమురంభీం : ఈఎస్ఐ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం
- బెల్లంపల్లి : ఏరియా ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం

☛ మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో ఆగస్టు 15న ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను స్నేహలత గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించారు. చాయ్, అల్పాహారం, నీళ్ల సీసాలు, శీతల పానీయాలు, ఇతర తినుబండారాలను, ఆహార పదార్థాలను నిర్వాహకులు అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో నిర్వాహకులకు ఉపాధితోపాటు ఇక్కడికి వచ్చే వారికి అందుబాటులో రుచికరమైన నాణ్యమైన ఆహార పదార్థాలు లభిస్తుండటంతో సమయం ఆదా అవుతోంది.



మంచిర్యాల కలెక్టరేట్ కార్యాలయంలో గ్రామైక్య సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్



క్యాంటిన్‌లో అల్పాహారం, భోజనాలు చేస్తున్న వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు, కలెక్టరేట్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది

ఉమ్మడి జిల్లాలో 20కి పైగా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20కి పైగా మహిళా శక్తి క్యాంటిన్ల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించారు. మంచిర్యాల జిల్లాలోని లక్సెట్టిపేట, నస్పూరు మినహా మిగతా ఎక్కడా వీటి ఏర్పాటు జరగలేదు.



అద్దె భారం తప్పింది

- గురిజాల లత, స్వయం సహాయక సభ్యురాలు, హాజీపూర్

నేను మరో ముగ్గురు సభ్యులం కలిసి కలెక్టరేట్‌లో క్యాంటిన్‌ను ఏర్పాటు చేశాం. వీటి ఏర్పాటుకు ఉచితంగా గది ఇవ్వడంతో అద్దె భారం తప్పింది. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు క్యాంటిన్ నిర్వహిస్తున్నాం. ఉదయం అల్పాహారం, పాలు, కాఫీ, టీలతో పాటు మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీ, కాఫీ ఇతర స్నాక్స్ అందుబాటులో ఉంచాం.

ఒకవైపు ఒరిగి.. ప్రమాదకరంగా మారి!



ప్రమాదకరంగా ఉన్న తీగలను చూపిస్తున్న రైతు

పెంచికల్‌పేట్ మండలంలోని గొట్లపేట్ రహదారి పక్కన ఉన్న పంట చేన్లలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు స్తంభం ఒకపక్కకు వంగింది. కేవలం తీగలే ఆధారంగా ఉండటంతో.. ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని సమీప చేను రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా తీగలు వదులై చేతికందే ఎత్తులో వేలాడుతుండటంతో.. పనులు చేసుకోలేకపోతున్నట్లు వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ అంజల్‌కుమార్‌ని వివరణ కోరగా.. వెంటనే తీగలను, స్తంభాన్ని సరిచేస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, పెంచికల్‌పేట్



చేనులో నేలకొరిగిన విద్యుత్తు స్తంభం

జాతీయ పోటీలకు క్రీడా పాఠశాల విద్యార్థిని

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలో గిరిజన బాలిక ఆదర్శ క్రీడా పాఠశాల 10వ తరగతి విద్యార్థిని ఎం.సాక్షి జాతీయ స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25-28 వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో జావెలిన్ త్రో క్రీడలో ఈ విద్యార్థి పాల్గొననుందని పేర్కొన్నారు. ఇటీవల హనుమకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. క్రీడాకారిణి సాక్షిని, అథ్లెటిక్ శిక్షకుడు విద్యాసాగర్‌ను డీటీడీవో రమాదేవి, ఏసీఎంవో పి. ఉద్ధవ్, ఏటీవో చిరంజీవి, జీసీడీవో శకుంతల, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్నాక్ విజయ్ కుమార్, స్నట్ల శంకర్, వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షకులు అభినందించారు.



ఎం.సాక్షి

అక్రమాన్ని అడ్డుకున్న అధికారులు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ మధ్య తరహా ప్రాజెక్టులు, చెరువుల్లోని మట్టిని అక్రమంగా తరలించి ట్రాక్టర్ల యజమానులు సొమ్ము చేసుకుంటున్నారు. సాగునీటి పారుదల శాఖ అత్యవసర పరిస్థితిలో నిర్మాణ దశలోని సాగునీటి పథకాల పనుల కోసం కాగజ్‌నగర్ మండలంలోని కోసిని శివారులో మట్టి నిల్వ చేశారు. దాదాపు వంద ట్రాక్టర్ల మట్టిని ఓ వ్యక్తి అక్రమంగా మంగళవారం తరలించేందుకు యత్నించాడు. ఈ విషయం సాగునీటి పారుదల శాఖ డీఈఈ తిరుపతికి తెలియడంతో.. వెంటనే స్పందించి తమ సిబ్బందిని ఘటన స్థలానికి పంపించారు. నాలుగు ట్రాక్టర్లలో మట్టి లోడ్ చేయక ముందే హెచ్చరించి ట్రాక్టర్లను తిరిగి పంపించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ప్రాజెక్టులు, చెరువుల్లోని మట్టిని తీసుకెళ్లొద్దన్నారు. ఎవరైనా అక్రమంగా మట్టిని తరలిస్తే క్రిమినల్ కేసులు చేయిస్తామని హెచ్చరించారు.



కోసిని రిజర్వాయర్ సమీపంలో మట్టి తరలింపునకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

వనాల పెంపకానికి ప్రోత్సాహం



నీలగిరి తోటను పరిశీలిస్తున్న ఎస్పీఎం ఆడిట్ బృందం సభ్యులు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని కోసిని గ్రామ శివారులో ఎస్పీఎం (సిర్పూర్ పేపర్ మిల్లు) ఆధ్వర్యంలో గుంట్ల రవికుమార్ సాగు చేస్తున్న నీలగిరి, సరుగుడు ప్లాంటేషన్లను ఎస్పీఎం ఆడిట్ బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీజీఎం సురేంద్రనర్‌కడె మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ మండలాల్లో మిల్లు అవసరాల కోసం నీలగిరి, సుబాబుల్ సాగు కోసం రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. సాగుపై వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. నీలగిరి, సరుగుడు మొక్కలు నాటి వనాల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. మొక్కలు నాటి వనాల పెంపకంతోపాటు ప్లాంటేషన్‌లోని సరకును కూడా తామే కొనుగోలు చేసి రైతులకు బాసటగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. మేనేజర్ సంతోష్, వార్ల కోటేష్, రైతులు తదితరులున్నారు.

అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో అక్రమ వ్యాపారాలు నిర్వహించే వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. ప్రజాపంపిణీ బియ్యం, పశువులు, ఇసుక, గంజాయి అక్రమ రవాణా చేయడం, మట్కా, గుట్కా, గ్యాంబ్లింగ్ తదితర నిరోధానికి నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. తరచూ అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్టు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో ఎవరైనా అక్రమ వ్యాపారాలు చేస్తున్నట్లు తెలిస్తే డయల్-100 లేదా చరవాణి నం.87126 70505 లో సమాచారం ఇవ్వాలని సూచించారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

24న రక్తదాన శిబిరం

పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ నెల 24న జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్ వద్ద మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీనికి పోలీసులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేయాలని కోరారు.



ఎస్పీ శ్రీనివాసరావు

పేదలపై అభిమానం.. సేవే పరమార్థం




● పల్లెబాట పట్టిన సివిల్ సర్వీస్ శిక్షణ అధికారులు

సివిల్ సర్వీస్ శిక్షణ అధికారుల బృందం క్షేత్రస్థాయి శిక్షణలో భాగంగా పల్లెబాట పట్టింది. ఆదిలాబాద్ గ్రామీణ మండలం లోకారి, ఖండాల, తదితర గ్రామాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్న అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలిస్తున్నారు. ఆదివాసీల స్థితిగతులు, తాగునీరు, రహదారులు, విద్యుత్తు సౌకర్యాలు, పాడిపంటలు, రవాణా సౌకర్యం, వ్యవసాయ పద్ధతులు అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను తెలుసుకుంటూ గ్రామాభివృద్ధికి సలహాలు, సూచనలు అందిస్తున్నారు. గుర్తించిన సమస్యలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందిస్తామన్నారు. ఈ పర్యటన ఎంతో ఉపయోగపడుతున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక సివిల్ సర్వీస్‌లో ఉన్న శిక్షణ అధికారులు ప్రజా సేవే లక్ష్యమని, పేదలంటే అభిమానమని, వారికి సేవ చేయడం ఆనందంగా భావిస్తున్నట్లు 'ఈనాడు'తో వారి మనోగతాన్ని పంచుకున్నారు. ప్రణాళికాబద్ధంగా, పట్టుదలతో చదివితే లక్ష్యానికి పేదరికం అడ్డురాదని నేటి యువతకు దిశానిర్దేశం చేశారు.

-న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం


ఆదిలాబాద్ మండల అధికారులతో సివిల్ సర్వీస్ శిక్షణ అధికారులు

నాన్న కష్టమే ఐపీఎస్‌ను చేసింది



నేను రైతు బిడ్డను. నాన్న వ్యవసాయంలో ఆరుగాలం పడే కష్టం ముందు నా లక్ష్యం అసాధ్యం కాదనిపించింది. ప్రాథమిక విద్య, ఇంటర్ ప్రైవేటులో.. డిగ్రీ బీఎస్సీ కంప్యూటర్ ప్రభుత్వ కళాశాలలో పూర్తి చేశా. ఎలాంటి శిక్షణ లేకుండా ఇంటి వద్దనే సొంత ప్రిపరేషన్‌తో రోజూ 8 గంటలు చదివేవాడిని. ఎలాంటి శిక్షణ లేకుండానే మొదటి ప్రయత్నంలో సివిల్స్‌లో ఐపీఎస్‌కు ఎంపికయ్యాను. నిబద్ధత, పట్టుదల, ఇష్టంతో చదివితే సాధ్యం కానిది ఏది లేదు.

- రౌనీక్ గౌతమ్, ఐపీఎస్ శిక్షణ అధికారి, ఉత్తరప్రదేశ్

ఓడిపోతే కుంగిపోవద్దు..



పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా ఒకటి కాదు.. రెండు కాదు.. మూడేళ్లు కష్టపడి చదివాను. లక్ష్య సాధనలో ఎన్నో ఆటుపోట్లు వచ్చినా లక్ష్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాను. అనుకున్నది సాధించి ఐఎస్ఎస్‌కు ఎంపికయ్యాను. నాన్న చతుర్భాజ్ గుప్తా వ్యాపారం చూసుకుంటారు. అమ్మ కామిని గుప్తా గృహిణి. వారి ప్రోత్సాహంతోనే విజయం సాధించాను. ఒక్కసారి ఓడిపోగానే వదిలేయొద్దు.

- ప్రకర్ గుప్తా, ఐఎస్ఎస్, ఉత్తరప్రదేశ్

దిల్లీకి వెళ్లాల్సిన అవసరం లేదు

- కౌశల్ కిశోర్, ఐఎఫ్ఎస్, బిహార్



సివిల్స్ సన్నద్ధతలో ఆన్‌లైన్ విద్యకు ప్రాధాన్యమిచ్చా. బీటెక్ ఐఐటీ దిల్లీలో పూర్తి చేశా. ఐఐటీ జేఈఈలో టెక్నాలజీ కన్సల్టెంట్‌గా పని చేశా. ఉద్యోగం చేస్తూనే ఆన్‌లైన్‌లోనే శిక్షణ తీసుకున్నాను. సివిల్స్‌లో శిక్షణ కోసం దిల్లీకి వెళ్లాల్సిన అవసరం లేదు. ఒకవేళ శిక్షణ కావాలనుకున్నవారు హైదరాబాద్‌లో తీసుకుంటే సరిపోతుంది. ప్రణాళిక, సరైన మార్గాన్ని ఎంచుకుంటే అనుకున్నది సాధించడానికి అవకాశం ఉంటుంది.

పోలీసులపై నమ్మకం కలిగిస్తా



వ్యక్తిగత నైపుణ్యం, పట్టుదల ఉంటే సివిల్స్ విజయం సాధించవచ్చు. యూట్యూబ్, గూగుల్ మాధ్యమాల ద్వారా మనకు అవసరమైన సమాచారం సులువుగా పొందవచ్చు. చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇంకా ఎలాంటి ఆలోచనలకు అవకాశం ఇవ్వొద్దు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే లక్ష్యాన్ని చేరుకున్నాను. ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తాను. పోలీసులపై మరింత నమ్మకం కలిగిస్తాను.

- రోషన్, ఐపీఎస్ శిక్షణ అధికారి, రాజస్థాన్

వార్తా పత్రికలు రోజూ చదవాలి

- ప్రసాద్ కృష్ణన్, ఐఆర్ఎస్, కేరళ



మాది కేరళలోని త్రివేండ్రం. నాన్న నందాకు మారన్ ప్రైవేట్ ఉద్యోగి. అమ్మ ప్రైవేట్ ఉపాధ్యాయురాలు. సివిల్స్ సన్నద్ధతలో భాగంగా వార్తా పత్రికలు రోజూ చదవాలి. అవి మన జనరల్ నాలెడ్జిని, విశ్లేషించే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయి. శిక్షణలో ముఖ్యంగా సాధన ఎక్కువగా ఉండాలి. ప్రతి అంశంపై పట్టు సాధించాలి. అమ్మానాన్నల కష్టాలను చూసి అనుకున్న లక్ష్యం వైపు వెనుకడుగు వేయకుండా ప్రయత్నించా. చెన్నైలో ఐఆర్ఎస్ కస్టమ్స్, పరోక్ష పన్నుల్లో పోస్టు ఇచ్చారు. పేదలకు సేవ చేయడం వరంగా భావిస్తున్నాను.

ప్రతికూలతలు దాటి..
విజేతగా నిలిచి!

● పెళ్లి.. పిల్లలు కొలువుకు ఆటంకం కాదని నిరూపించిన సుమలత

న్యూస్‌టుడే, ఉట్నూరు : పేద కుటుంబంలో జన్మించి ప్రతికూల పరిస్థితుల మధ్య చదివింది ఆమె.. చిన్న వయసులోనే పెద్దలు పెళ్లి చేశారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యం ముందు అవన్నీ కరిగిపోయాయి. గృహిణిగా ఉంటూనే.. భర్త ప్రోత్సాహంతో ఉన్నత విద్యను పూర్తి చేసి రాత్రింబవళ్లు కష్టపడి విజయం సాధించారు. ఇటీవల విడుదలైన ఉద్యోగాల ఫలితాలలో ఎస్జీటీగా కొలువు సాధించి ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారు.



నిర్మల్ జిల్లా కడెం మండలానికి చెందిన రాపెల్లి రాయలింగు, సత్తవ్వ దంపతులది నిరుపేద వ్యవసాయ కుటుంబం. వీరికి రవీందర్, వెంకటేష్, సుమలత ముగ్గురు సంతానం. సుమలత స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివారు. పదో తరగతిలో 526 మార్కులు సాధించి స్థానికుల మన్ననలు అందుకున్నారు. తల్లిదండ్రులు అప్పులు చేసి మంచిర్యాలకు పంపించి ఇంటర్ చదివించారు. ఆ తరువాత ఆమె టీటీసీ ప్రవేశ పరీక్ష రాసి ర్యాంకు పొందడంతో ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డైట్ కళాశాలలో టీటీసీ సీటు సాధించారు. కుటుంబ పరిస్థితుల కారణంగా తల్లిదండ్రులు ఆమె టీటీసీ చేస్తుండగానే కొండా సత్యం అనే యువకుడికి ఇచ్చి వివాహం చేశారు.

భర్త ప్రోత్సాహంతో..

టీటీసీ చేస్తుండగానే పెళ్లి చేసినా.. లక్ష్యాన్ని మాత్రం వీడలేదు. ఆమెకు హిమన్ష్, మేధాన్ష్ అనే ఇద్దరు పిల్లలు జన్మించారు. ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలనేది తన ఆశయమని భర్త సత్యంతో మనసులోని మాటను పంచుకున్నారు. భర్త ఆమెను ప్రోత్సహించడంతో టీటీసీ పూర్తి చేయడంతోపాటు డిగ్రీ చదివారు. బీఈడీ ప్రవేశ పరీక్ష రాసి ర్యాంకు సాధించి బీఎడ్ చేశారు. పీజీలో ఎమ్మెస్సీ మ్యాథ్స్ చేశారు. ఉద్యోగాల కోసం కసితో సాధన చేశారు. డీఎస్సీ రాశారు. మంచి ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఉద్యోగం పొందారు. పెళ్లయిన పదేళ్ల తరువాత తన కలను నెరవేర్చుకున్నారు. తాజాగా దస్తూరాబాద్ మండం గొడిసిర్యాలలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో టీచరుగా తొలి పోస్టింగ్ పొందారు. పెళ్లి.. పిల్లలు.. కుటుంబ బాధ్యతలు ఇవేవి విజయానికి అడ్డుకాదని నిరూపించారు.

సమీకృత వ్యవసాయం, సాంకేతిక విధానంపై అవగాహన


విద్యార్థులకు డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం జగిత్యాల, సిరిసిల్ల కళాశాలలకు చెందిన కృషి అనుభవ విద్యార్థులకు సమీకృత వ్యవసాయ విధానం, డ్రోన్ సాంకేతిక విధానంపై మంగళవారం మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి అవగాహన కల్పించారు. మందమర్రి మండలంలోని బొక్కలగుట్ట గ్రామంలోని సమీకృత వ్యవసాయ క్షేత్రంలో సమీకృత వ్యవసాయ విధానంపై అవగాహన కల్పించారు. సమీకృత వ్యవసాయ విధానంలో వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి, చేపలు, కోళ్లు, తేనెటీగల పెంపకం, చిన్నతరహా పరిశ్రమలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ విధానంతో రైతుకు ఎక్కువ నికర ఆదాయంతో పాటు నష్ట భయం తగ్గుతుందని తెలిపారు. సారంగపల్లి గ్రామంలోని ఓ పొలంలో డ్రోన్ పరికరం ద్వారా పురుగు మందుల పిచికారీపై ప్రదర్శనాత్మక అవగాహన కల్పించారు. ఈ విధానం ద్వారా పది లీటర్ల నీటిని ఉపయోగించి ఆరు నిమిషాల్లో ఒక ఎకరా విస్తీర్ణంలో పురుగు మందులు పిచికారి చేసుకోవచ్చని తెలిపారు. ఏఈఓలు ముత్యం తిరుపతి, కనకరాజు, విద్యార్థులు తిరుపతి, శ్రీధర్, నవితేజ, శ్రీచరణ్, విపిన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు లేక.. పర్యవేక్షకులకు పరీక్ష

మంచిర్యాలలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతోంది. జనరల్ మెడిసిన్‌లో వైద్యులు సక్రమంగా రావడం లేదు. పిల్లల విభాగం పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. ఇప్పుడు ఈఎన్‌టీ(చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు) వంతు వచ్చింది. ఉన్న ఇద్దరు సెలవులో ఉండటంతో తప్పని పరిస్థితుల్లో ఆయా విభాగం ప్రొఫెసర్, జీజీహెచ్ పర్యవేక్షణాధికారి ఓపీ గదిలో ఉండాల్సి వస్తోంది.

- న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ


ఈఎన్‌టీ ఓపీ విభాగంలో మంగళవారం పరీక్షలు నిర్వహిస్తున్న పర్యవేక్షణాధికారి డా.హరిశ్చంద్రారెడ్డి

పక్షం రోజులే గడువు!



● ఎమ్మెల్సీ ఓటరు నమోదులో టీచర్లు, పట్టభద్రుల నిర్లిప్తత

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే:

పట్టభద్రుల, ఉపాధ్యాయ మండలి ఎన్నికల సందడి మొదలైంది. ఇందుకు కీలమైన ఓటరు నమోదు ప్రక్రియ మాత్రం మందకొడిగా సాగుతోంది. ఓటు నమోదు దరఖాస్తుల స్వీకరణకు నవంబరు ఆరో తేదీ తుది గడువు. అంటే మరో పక్షం రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది.



జిల్లాలవారీగా ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు

జిల్లా	ఉపాధ్యాయులు	పట్టభద్రులు
కుమురంభీం	12	1,049
మంచిర్యాల	61	7,742
ఆదిలాబాద్	37	3,063
నిర్మల్	55	4,838

● జిల్లా
● ఉపాధ్యాయులు
● పట్టభద్రులు

బోధకుల నిరాసక్తత


సాధారణంగా ఉపాధ్యాయ, అధ్యాపక వృత్తిలో కొనసాగే వారిని మేధావివర్గంగా భావిస్తుంటాం. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు విషయంలో మాత్రం ఆ వర్గం దూరంగా ఉంటోంది. పలు సంఘాలు పాఠశాలలకు వెళ్లి స్వచ్ఛందంగా నమోదు పత్రాలు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.



ఉమ్మడి జిల్లాలో దాదాపు 30 వేల మంది టీచర్లు, అధ్యాపకులు ఉండగా ఇప్పటి వరకు 165 మంది మాత్రమే ఎమ్మెల్సీ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు.

ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పట్టభద్రులు, టీచర్లు ఓటర్లుగా ఉంటారు. మండలి ఎన్నికల్లో ఓటు వేయాలంటే కొత్తగా అర్హులంతా దరఖాస్తు చేసుకోవాల్సిందే. కిందటి ఎన్నికల ఓటరు జాబితాలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో టీచర్లు 4,599 మంది, పట్టభద్రులు 38,908 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం ఇప్పటి వరకు టీచర్లు 165 మంది దరఖాస్తు చేసుకుంటే పట్టభద్రుల ఓటు కోసం 16,692 మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

కేంద్రాలు వెలవెల..



అన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో టీచరు, పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక అధికారిని నియమించి దరఖాస్తులను అందుబాటులో ఉంచినా ఆ కేంద్రాలకు వచ్చేవారే కరవయ్యారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉన్నా ఓటర్ల నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉంటోందని అధికారవర్గాల మాట.

ఎవరు అర్హులు..

పట్టభద్రులు ఓటు నమోదు(ఫాం-18) చేసుకోవాలంటే 2021 అక్టోబరు 31 నాటికి డిగ్రీ పూర్తయి ఉండాలి. టీచర్లు/అధ్యాపకులైతే 2018 నవంబరు ఒకటి నుంచి 2024 అక్టోబరు 31 వరకు మూడు సంవత్సరాలకు తగ్గకుండా ఉన్నత పాఠశాల, కళాశాల స్థాయి విద్యాసంస్థల్లో పనిచేసి ఉంటే వారు ఫారం-19 పూరించి ఓటు నమోదు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లో నమోదు ఇలా

ఇంటి వద్ద నుంచి ఓటు నమోదు చేసుకోవాలనుకునే వారు www.ceotelangna.nic.in వెబ్‌సైటును సంప్రదించి పట్టభద్రులైతే ఫారం-18, టీచర్లయితే ఫారం-19 దరఖాస్తును పూరించి గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన డిగ్రీ సర్టిఫికెటు, ఆధార్, ఓటరు ఐడీ పత్రాలతోపాటు ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవచ్చు.


జగదాంబ ఆలయంలో కొనసాగుతున్న విద్యార్థుల చదువులు

గుడిలో సాగుతున్న బడి

ఈటీవీ – ఆదిలాబాద్, న్యూస్‌టుడే – బేల :

అక్షరాలు నేర్చుకోవాలంటే బడికి వెళ్లాలి. పూజా కార్యక్రమాలకు గుడికి వెళ్లాలి. ఇది అందరికి తెలిసిందే. బేల మండలం పిట్‌గావ్(ఎల్) చిన్నారులు చదువుకోవటానికి బడికి కాకుండా గుడికి వెళ్తున్నారు. ఇక్కడ అంతా గిరిజనులే. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు మొత్తం 36 మంది విద్యార్థులు ఉన్నారు. పాత బడి శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం ఏడాది కిందట రూ.21 లక్షలు కేటాయించింది. విద్యాశాఖాధికారులు, ఇంజినీర్ల పర్యవేక్షణ కరవై గుత్తేదారు పిల్లర్లు వేసి భవన నిర్మాణాన్ని మధ్యలోనే వదిలేశాడు. స్థానికులంతా కలిసి ఆరునెలల కిందటి వరకు గ్రామంలోని హనుమాన్ ఆలయంలో, తాజాగా ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న జగదాంబ దేవి ఆలయంలో చదువులను కొనసాగిస్తున్నారు. తాజాగా నియామకాల్లో కొత్తగా ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయుడు హరికృష్ణ ఆ గుడిలోనే పిల్లలకు బోధిస్తున్నారు.

☛ ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోలేదని.. పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడకూడదనే ఆలోచనతో గుడిలో ఏర్పాటుచేసిన బడికి పంపిస్తున్నామని గ్రామస్థులు జాదవ్ విలాస్, పవార్ గోపీ ఆవేదన వ్యక్తం చేశారు.

☛ జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీతను 'ఈనాడు' సంప్రదించే ప్రయత్నం చేయగా స్పందించలేదు.


పిట్‌గావ్(ఎల్)లో ఆగిపోయిన పాఠశాల కొత్త భవన నిర్మాణ పనులు

అయిదుగురు ఏఈఓల సస్పెన్షన్

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే: రైతు బీమా విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు మంచిర్యాల జిల్లాలోని అయిదుగురు వ్యవసాయ విస్తరణాధికారుల(ఏఈఓ-గ్రేడ్)ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. లక్షెట్టిపేట, జైపూర్, బెల్లంపల్లి, నస్పూర్, చెన్నూరు మండలాలకు చెందిన ఒక్కో ఏఈఓను సస్పెండ్ చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి కల్పనను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా జిల్లాలోని అయిదుగురు ఏఈఓలను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు.

ఉపకార వేతనం.. భవితకు ఊతం




దండేపల్లి, న్యూస్‌టుడే: చదువుకోవాలనే తపన ఉన్నా ఆర్థిక స్థోమత లేక ఎంతో మంది విద్యార్థులు తమ చదువులను అర్ధంతరంగా ఆపేసిన సంఘటనలు ఉన్నాయి. ఈ తరుణంలో ప్రతిభ ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఊతం అందిస్తోంది. వీటిని అందిపుచ్చుకుని ఉన్నత విద్యను అభ్యసిస్తూ ముందుకు సాగుతున్నారు. పరీక్షలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపకార వేతనాలు (ఎన్ఎంఎంఎస్) అందిస్తోంది. నాలుగేళ్ల పాటు ఉపకారం అందుకుంటూ ఉన్నత చదువులు చదివే అవకాశముంది. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జాతీయ స్థాయిలో పరీక్ష ఉంటుంది. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఏటా రూ. 12 వేల చొప్పున తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు నాలుగేళ్ల పాటు ఉపకారవేతనం అందిస్తారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అర్హులు. వచ్చే నెల 24న అన్ని జిల్లా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు.

ఇందులో మొత్తం 180 మార్కులు ఉండగా పరీక్షలో రెండు విభాగాలు ఉంటాయి.

☛ మొదటిది (పార్ట్ 1): మానసిక సామర్థ్య పరీక్ష 90 ప్రశ్నలకు 90 మార్కులుంటాయి. ఇందులో రీజనింగ్ ఎబిలిటిస్, సంఖ్యా శాస్త్రం, పదాల భిన్న పరీక్ష, నంబర్ అనాలజీ, ఆల్ఫాబెట్ అనాలజీ, కోడింగ్-డీకోడింగ్, లాజికల్ ప్రశ్నలు, వెన్‌చిత్రాలు, మిర్రర్ ఇమేజెస్, వాటర్ ఇమేజెస్ తదితర అంశాలలో ప్రశ్నలు ఉంటాయి. వీటిని సాధన చేయాలి.

☛ రెండో విభాగంలో ఏడు, ఎనిమిదో తరగతి సిలబస్ నుంచి 90 ప్రశ్నలు, 90 మార్కులుంటాయి. గణితం 20 మార్కులు, భౌతిక, రసాయన, జీవ శాస్త్రం కలిపి 35 మార్కులు, సాంఘీక శాస్త్రంలో 35 మార్కులు. పరీక్ష ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో బహుళైచ్ఛిక (మల్టిపుల్ ఛాయిస్) రూపంలో ఉంటాయి. పరీక్షకు కేవలం నెల రోజులు మాత్రమే ఉండటంతో ప్రణాళికాబద్ధంగా సాధన చేస్తే విజయం దక్కుతుంది. ఉమ్మడి జిల్లా నుంచి 240 మంది వరకు ఎన్నికయ్యే అవకాశముంది.


సాధన చేస్తున్న విద్యార్థులు

ఈ ఏడాది జిల్లాల వారీగా పరీక్ష రాసే విద్యార్థులు

జిల్లా	అభ్యర్థులు
ఆదిలాబాద్	564
మంచిర్యాల	1059
నిర్మల్	926
కుమురంభీం	482

● జిల్లా
● అభ్యర్థులు

ఉన్నత చదువులు చదువుతూ..

-రాంటెంకి విష్ణువర్ధన్



జన్నారం మండలం కిష్టాపూర్ ఉన్నత పాఠశాలలో చదివిన రాంటెంకి విష్ణువర్ధన్ ఎనిమిదో తరగతి పూర్తికాగానే జాతీయ ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. ఉపకార వేతనం పొందుతూ ఇక్కడే పదో తరగతి పూర్తి చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీలో ఇంటర్మీడియట్ చేస్తున్నారు. తన చదువులకు ఉపకార వేతనం ఎంతో తోడ్పడిందని ఆయన చెబుతున్నారు. ఇదే పాఠశాల నుంచి గతేడాది పది మంది విద్యార్థులు ఎంపికకాగా ఇప్పటి వరకు 240 మంది ఎంపిక కావడం గమనార్హం..

ప్రణాళికాబద్ధంగా సాధన

- ముత్తె వెంకటమల్లు, ఉపాధ్యాయుడు, వెల్గనూర్



ఉపకార వేతనం మధ్యతరగతి, పేద కుటుంబాల విద్యార్థులకు ప్రయోజనం. విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం వరిస్తుంది. మంచి భవిష్యత్తు ఉంటుంది. గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రంలోని వివిధ పాఠాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. మానసిక సామర్థ్యానికి సంబంధించిన అంశాలను రోజూ సాధన చేయాలి. గత పరీక్షల పేపర్లలో వచ్చిన ప్రశ్నలకు అనుగుణంగా సాధన చేయాలి.



● గతేడాది జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైన జన్నారం మండలం కలమడుగు విద్యార్థులతో ఉపాధ్యాయులు. పది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రతి రోజూ పరీక్ష రాయబోయే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి, ఉపాధ్యాయులు కలిసి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు.

ప్రాణం తీసిన కరెంట్


సతీష్

కోటపల్లి, న్యూస్‌టుడే: వ్యవసాయంలో తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. సాగు పనుల్లో తండ్రితో పాటు బాధ్యతను పంచుకున్నాడు. ప్రమాదవశాత్తు జరిగిన విద్యుదాఘాతంతో యువరైతు విగత జీవిగా మారాడు. ఈ ఘటన ఆ కుటుంబంలో తీరని శోకాన్ని నింపింది. వివరాల్లోకి వెళ్తే.. కోటపల్లి మండలం రాపన్‌పల్లి గ్రామానికి చెందిన భూర్తి సతీష్ (25) యువరైతు మంగళవారం పత్తి చేనుకు నీటి తడులను అందించేందుకు వెళ్లాడు. మోటారుకు విద్యుత్తు సరఫరా చేసే తీగ చెడిపోయి నీటిని బయటికి వదిలే ఇనుప పైపును తాకి ఉంది. ఇది గమనించని సతీష్ మోటారును స్టార్ట్ చేసి సంబంధిత పైపును పట్టుకోవడంతో విద్యుత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. రాజబాపు - పద్మ దంపతులకు ఇద్దరు కొడుకులు ఉండగా మృతుడు సతీష్ మొదటి సంతానం. తమకున్న కొద్ది పాటు భూమితో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని జీవనోపాధి పొందుతున్న కుటుంబంలో కుమారుడు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎస్సై రాజేందర్ సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.

27న మందకృష్ణ మాదిగ రాక

జన్నారం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈ నెల 27న జన్నారం వస్తున్నట్లు మాదిగ సంఘం జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, మండల అధ్యక్షుడు కొండుకూరి ప్రభుదాస్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లుగా వారు పేర్కొన్నారు. నాయకులు మామిడిపెల్లి ఇంధయ్య, కృష్ణ, రమేశ్, రవి, రాజేశ్, ఎల్లయ్య, రాహుల్, అంజన్న, వెంకటేశ్, ప్రశాంత్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 83418 12400
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే:
? పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణాలు లేక ఇబ్బందులు పడుతున్నాం.- **ఇందారపు హారిక, శ్రీనగర్, కాగజ్‌నగర్**
✔ పురపాలిక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించాం. నిధుల మంజూరు అనంతరం నూతన రోడ్ల నిర్మాణాలు చేపడతాం.- **అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్**

కౌటాల, న్యూస్‌టుడే:
? మండలంలోని వీర్దండి గ్రామంలోని ఎస్సీకాలనీ పోచమ్మవాడకు కొన్ని నెలలుగా మంచినీటి సరఫరా జరగడం లేదు. ఈ విషయంలో సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదు. తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.- **దుర్గం బాబురావు, వీర్దండి**
✔ ఎస్సీ కాలనీలో మంచినీటి సరఫరాలో అంతరాయం ఉన్న మాట వాస్తవమే. కొన్నిచోట్ల కుళాయి కనెక్షన్లు చెడిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. పంచాయతీలో నిధుల కొరత ఉన్నందున పనులు చేయలేకపోతున్నాం. నిధులు మంజూరు కాగానే పునరుద్ధరిస్తాం.
- **సురేష్, పంచాయతీ కార్యదర్శి, వీర్దండి**

సిర్పూర్(టి), న్యూస్‌టుడే:
? సిర్పూర్(టి) హెచ్‌పీ పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న ఎస్టీ కాలనీలో నాలాలు లేక మురుగు నీరు రోడ్డుపైకి వస్తోంది. కాలనీ మొత్తం దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. నాలాలు నిర్మించాలి.
- **మల్రాజ్ నవీన్, సిర్పూర్(టి)**
✔ సిర్పూర్(టి)లో కొన్ని కాలనీలకు సంబంధించిన నాలాల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించాం. వారి ఆదేశానుసారం త్వరలోనే పరిష్కరిస్తాం.
- **ఎస్.తిరుపతి, పంచాయతీ కార్యదర్శి, సిర్పూర్(టి)**


పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందిస్తున్న ప్రిన్సిపల్ మహేశ్వర్

ప్రతిభకు వేదిక.. ప్రోత్సాహ గీతిక

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: సమాజంలో సాంకేతిక వినియోగం విపరీతంగా పెరిగింది. పిల్లలు, పెద్దలు దాదాపు ఎవరిచేతిలోనైనా ఆండ్రాయిడ్ ఫోన్ లేని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. కానీ దీని ద్వారా మంచి, చెడు రెండూ ఉన్నాయి. వీటిపై విద్యార్థుల్లో ఏ మేరకు అవగాహన ఉందన్న విషయం తెలుసుకునేలా పాఠశాలల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 8, 9, 10 తరగతి విద్యార్థులకు 'ఇంటర్నెట్‌తో లాభనష్టాలు', 'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో తమ ప్రతిభను చాటేందుకు 100 మంది విద్యార్థులు ముందుకొచ్చారు. మొదటి స్థానంలో బోయిరె ప్రణతి (10వ తరగతి), ద్వితీయ స్థానంలో దుర్గం దివ్య (9వ తరగతి), తృతీయ స్థానంలో గణపురం భావజ్ఞ (8వ తరగతి)లు నిలువగా.. పాఠశాల ప్రిన్సిపల్ డి. మహేశ్వర్ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనవాళ్లు కనిపించని ఆశయం!


వల్లకొండ పంచాయతీ సోమయ్యగూడలో..

పశువుల దాహార్తి తీర్చాలనే సదాశయంతో ప్రభుత్వాలు గ్రామీణ ఉపాధి హామీ నిధులు వేలాది రూపాయలు వెచ్చించి గ్రామాల్లో నీటి తొట్టెలను నిర్మించారు. వాటి నిర్వహణ బాధ్యతలను పంచాయతీలకు అప్పగించారు. అయితే మండలంలోని కొన్ని గ్రామాల్లో నిర్వహణ లోపం కారణంగా వాటి ఆనవాళ్లు కోల్పోతున్నాయి. గ్రామాల్లో వివిధ సంక్షేమ పథకాల అమలుపై పర్యవేక్షణ చేస్తున్న అధికారులకు నీటి తొట్టెల నిర్వహణ కనిపించడం లేదా అని పశుపోషకులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని వల్లకొండ పంచాయతీ పరిధి సోమయ్యగూడెంలో నిర్మించిన నీటితొట్టె అధ్వానంగా మారింది. చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి కనిపించని స్థితికి చేరింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తొట్టెలను వినియోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, కాగజ్‌నగర్ గ్రామీణం**

స్వచ్ఛత పనుల్లో భాగస్వాములవండి

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ప్రతి ఉద్యోగి స్వచ్ఛత కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాలని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం గోలేటిలోని బంగ్లాస్ ఏరియాలో స్వచ్ఛత పక్వాడ (స్పెషల్ కాంపెయిన్ 4.0) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం పారతో చెత్తా చెదారాన్ని తొలగించి చీపురుతో ఊడ్చి శుభ్రం చేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ.. బెల్లంపల్లి ఏరియాలో స్వచ్ఛత కార్యక్రమాలు ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఏరియాలో పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛత కార్యక్రమాలు చేసేందుకు ప్రతి ఉద్యోగి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రోజుకు ఒక గంటపాటు స్వచ్ఛత పనులకు కేటాయించాలన్నారు. కాలనీలలో గడ్డి మొక్కలను పూర్తిస్థాయిలో తొలగించి సుందరంగా తీర్చిదిద్దాలని సివిల్ అధికారులకు సూచించారు. ఈ సారి బెల్లంపల్లి ఏరియాకు స్వచ్ఛతలో మొదటి స్థానం వచ్చేలా ప్రతి ఉద్యోగి కృషి చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం రాజమల్లు, ఏరియా ఇంజినీర్ భీమ్‌రావు జాడే, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సివిల్ ఎస్ఈ ఎస్కే మదీనా భాషా, ఎన్విరాన్‌మెంట్ అధికారి రమేశ్ అకౌంట్ అధికారి వెంకటేశ్వర్లు, ఐటీ ఇన్‌ఛార్జి ముజీబ్ పాల్గొన్నారు.



పారతో చెత్తను తొలగిస్తున్న జీఎం ఎం. శ్రీనివాస్

తనిఖీ చేసి.. పరీక్షించి

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : మండలంలోని పార్వతిగూడ, వావుదం, మోవాడ్ గిరిజన ఆశ్రమ పాఠశాలలను అకాడమిక్ మానిటరింగ్ అధికారి పి. ఉద్ధవ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఏ-1 పరీక్షల నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనం మెనూ, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.


పరీక్షల తీరును పరిశీలిస్తున్న ఏఎంవో పి.ఉద్ధవ్

మరుగుదొడ్ల నిర్మాణాలకు దరఖాస్తుల ఆహ్వానం


కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : కాగజ్‌నగర్ మండలంలోని ఆయా పంచాయతీల్లో ఇప్పటి వరకు మరుగుదొడ్లు నిర్మించుకోలేని వారు సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తులు అందజేయాలని ఎంపీడీఓ రమేశ్ తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫొటోతో దరఖాస్తులను ఆయా కార్యదర్శులకు అందజేయాలని ఆయన సూచించారు

ఆర్భాటంగా ప్రారంభం.. అడుగేపెట్టని వైనం

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే:
దశాబ్దాల కిందట నిర్మించిన కొన్ని ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. స్లాబ్ పెచ్చులూడుతుండటంతో ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి. అంతేకాకుండా పాత గోడలు వర్షాలకు నానిపోవడంతోపాటు గోడలు, కిటికీలకు ముళ్ల పొదలు ఆవరించాయి. విషపురుగులు గదుల్లోకి వస్తున్నాయని సిబ్బందితోపాటు రోగులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా వీటి స్థానంలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన కొత్తవి ప్రారంభోత్సవానికే పరిమితమయ్యాయి. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

మండలంలోని ఉమ్మడి నజ్రుల్‌నగర్ పంచాయతీలోని 13 బెంగాలీ గ్రామాలతోపాటు అనుకోడ, మండువ, గన్నారం తదితర గ్రామాలకు వైద్య సేవలందించాలనే ఆశయంతో 1975లో ఈజ్‌గాం పేరుతో విలేజి నెం.12లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్ పెచ్చులూడి ఆరోగ్య సిబ్బంది తలలపై పడి గాయాలపాలయ్యారు. ఈ నేపథ్యంలో ఈజ్‌గాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.56 కోట్ల అంచనా వ్యయంతో నూతన భవనం నిర్మించారు. ఈ ఏడాది జూన్ 30న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క ఘనంగా ప్రారంభించారు. నాలుగు నెలల గడిచిన పాత భవనం నుంచి కొత్తదానిలోకి తరలించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. పాత భవనం చుట్టు పొదలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి నూతన భవనంలోకి తరలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


అలంకారప్రాయంగా నూతన భవనం


పెచ్చులూడుతున్న పీహెచ్‌సీ పాత భవనం స్లాబ్


ఈజ్‌గాం పీహెచ్‌సీ పాత భవనం కిటికీలను ఆవరించిన పొదలు

సీఐల బదిలీ

ఆసిఫాబాద్, రెబ్బెన, కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లాలో పలువురు సీఐలు బదిలీ అయ్యారు. మంగళవారం మల్టీ జోన్-1 ఐజీ పేరున బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రామగుండం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐ పల్నాటి రాజేంద్ర ప్రసాద్.. కాగజ్‌నగర్ పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న టి. శంకరయ్యను ఐజీపీలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. కాగా రాజేంద్రప్రసాద్ 2021 జనవరి నుంచి 2022 ఆగస్టు వరకు కాగజ్‌నగర్ రూరల్ సీఐగా పనిచేశారు. ఎనిమిది నెలల కాలంలోనే సీఐ తుత్తూరు శంకరయ్య బదిలీ అయ్యారు. రామగుండం సీసీఆర్‌బీలో పని చేస్తున్న సీఐ బుద్దే స్వామిని రెబ్బెన పీఎస్‌కు కేటాయించారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న ఎన్.చిట్టిబాబును ఐజీపీలో రిపోర్టు చేయాలని తెలిపారు. ఆసిఫాబాద్ సీఐ సతీష్‌ను ఐజీపీలో రిపోర్టు చేయాలని సూచించగా.. ఆయన స్థానంలో ఇంటలీజెన్స్ విభాగంలో పని చేస్తున్న బుద్దె రవీందర్‌ను ఆసిఫాబాద్ పీఎస్ సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


బుద్దే స్వామి


రాజేంద్రప్రసాద్

పురుగుమందు తాగి వృద్ధుడి బలవన్మరణం

తిర్యాణి, న్యూస్‌టుడే: పురుగుమందు తాగి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై మాధవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెర్కపల్లికు చెందిన చుంచు లింగవ్వ అయిదు సంవత్సరాల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి అతని భర్త చుంచు రాజలింగు(82) మానసికంగా బాధపడుతుండే వారు. ఈక్రమంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మొదట తిర్యాణి సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తర్వాత వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతుడి కుమారుడు చుంచు బాపు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బెల్లం పట్టివేత

సిర్పూర్(టి), న్యూస్‌టుడే: మహారాష్ట్ర నుంచి వరంగల్‌కు ఐచర్ వ్యానులో అక్రమంగా తరలిస్తున్న 11 టన్నుల బెల్లం (సుమారు రూ.5,55,000) పట్టుకున్నట్టు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని ఆస్టీ గ్రామం నుంచి వరంగల్‌కు వాహనంలో ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు వెంకట్రావ్‌పేట్ గ్రామ సమీపంలో పట్టుకున్నట్టు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన అవేష్ అగ్వాన్, పురుషోత్తం గరీబా ఉకే అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.


పట్టుకున్న నిందితులతో ఎస్సై కమలాకర్...

కాగజ్‌నగర్‌లో దేశీదారు..

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : పట్టణంలోని సంఘం బస్తీలో నివాసముంటున్న అక్కపాక సాంబయ్య ఇంట్లో నిల్వ ఉంచిన దేశీదారు సీసాలను పట్టుకున్నట్టు టౌన్ సీఐ తుత్తూరు శంకరయ్య తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు టౌన్ ఎస్సై గట్ల సుధాకర్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా రూ.1,050 విలువగల 30 దేశీదారు సీసాలు లభ్యమయ్యాయన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి సీసాలను అదుపులోకి తీసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు.

జిల్లాలో సేవ చేసేందుకు ఎక్కువ అవకాశాలు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో లయన్స్ క్లబ్ సేవలను విస్తృత పరచడానికి శ్రద్ధ తీసుకోవాలని క్లబ్ జోన్ ఛైర్మన్ నాంపల్లి శంకర్ క్లబ్ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్ లయన్స్ భవనంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన జోన్ సలహా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వెనుకబడిన కుమురం భీం జిల్లాలో సేవా కార్యక్రమాలు చేపట్టడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అవసరమైన వారికి సేవలను అందించడం ద్వారా సంతృప్తిని పొందవచ్చని తెలిపారు. ఆసిఫాబాద్ క్లబ్‌లో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి, శవపేటికను అందుబాటులో ఉంచడానికి చర్యలు తీసుకొంటున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లయన్ అబ్దుల్ ఫయాజ్, పరిశీలకులు లయన్ ఇరుకుల్ల ఆంజనేయులు, డైరెక్టర్ రావుల వినాయక్‌రావు, క్లబ్ అధ్యక్షులు ఉబేద్ బిన్ యాహియా, ఉపాధ్యక్షులు వేణు, పుల్లూరి శంకర్, పీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ జోన్ ఛైర్మన్ నాంపల్లి శంకర్

నేటి నుంచి ఉపాధిహామీ గ్రామసభలు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై బుధవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమేష్ తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై గ్రామసభల్లో ప్రణాళికలు రూపొందించనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

నేడు గోయగాం ధ్యానకేంద్ర వార్షికోత్సవం

వాంకిడి, న్యూస్‌టుడే: మండలంలోని గోయగాం పులాజీబాబా ధ్యానకేంద్ర వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పులాజీబాబా సంస్థాన్ పాట్నాపూర్ గౌరవ అధ్యక్షుడు కేశవరావు, వామన్‌రావుల ఆధ్వర్యంలో ధ్వజారోహణ కార్యక్రమం, అనంతరం భక్తి ప్రవచనాలు, అన్నదాన వితరణ ఉంటుందని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కుమురంభీంకు ఘన నివాళి

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో ఆదివాసీ కోలవార్ (మన్నేవార్) సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కుమురంభీం వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీ దేవరతో ఊరేగింపు చేపట్టారు. నాయకులు బక్కయ్య, సతీష్, వెంకటేష్, మల్లేష్, యువకులు పాల్గొన్నారు.


కుమురంభీం విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

హోటల్‌లో దించి.. తర్వాత తీసుకెళ్లి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన గుడ్లను గుత్తేదారు సిబ్బంది ఓ ప్రైవేటు హోటల్‌లో దించడం చర్చనీయాంశంగా మారింది. వీటిని కొందరు విలేకర్లు వీడియోలు తీయడంతో గమనించిన సదరు వాహన చోదకుడు తిరిగి గుడ్ల ట్రేలను వాహనంలో జిల్లా కేంద్రానికి తీసుకురావడం గమనార్హం. అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లను సరఫరా చేసేందుకు ఓ గుత్తేదారు టెండర్‌లో దక్కించుకున్నారు. జిల్లా కేంద్రంలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. సదరు సిబ్బంది ఒకరు మంగళవారం మండలంలోని గొల్లగూడ అంగన్‌వాడీ కేంద్రం కోసం 25 ట్రేల గుడ్లు తీసుకెళ్లారు. కానీ ఆ కేంద్రంలో దించకుండా వాటిని వాంకిడి మండలం బెండారలోని ఓ హోటల్‌లో దించాడు. దీనిని ఓ విలేకరి వీడియో తీయడంతో.. గమనించిన సదరు చోదకుడు తిరిగి వాటిని వాహనంలో వేసుకొని జిల్లా కేంద్రానికి బయలుదేరాడు. ఈమేరకు చోదకుడిని ప్రశ్నించగా మరిచిపోయి హోటల్‌లో ఉంచి మళ్లీ తీసుకున్నట్లు చెప్పడం గమనార్హం. దీనిపై ఏసీడీపీవో తిరుమలదేవి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో దిగుమతి అయితేనే తమ బాధ్యత ఉంటుందన్నారు. సదరు సిబ్బంది బయట ఇస్తే తమకు సంబంధం ఉండదని చెప్పారు. కాగా కొంత కాలంగా ఇదే తీరు కొనసాగుతున్నట్లు గుసగుసలు వినిపించాయి.


హోటల్ వద్ద ఉంచిన గుడ్లు

25న వర్షవాస్ ముగింపు కార్యక్రమం

వాంకిడి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జేతవాన్ బుద్ధ విహార్‌లో ఈ నెల 25న నిర్వహించే వర్షవాస్ గ్రంథ పఠనం ముగింపు కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బౌద్ధమహాసభ అధ్యక్షుడు ఉప్రె జయరాం పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బుద్ధ విహారలో వర్షవాస్ ముగింపు కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. సాయంత్రం ఆరు గంటలకు బుద్ధవందనం అనంతరం సంఘం శరణం గచ్ఛామి నాటిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు వివరించారు. జిల్లాలోని నలుమూలల నుంచి బౌద్ధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సునీల్‌కుమార్, ఉపాధ్యక్షుడు మహోల్కర్ అశోక్, దుర్గం హంసరాజ్, శ్యాంరావు, సభ్యులు విఠల్, ప్రశాంత్, కోబ్రగడె విలాస్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బౌద్ధమహా సభ సభ్యులు


గెలుపొందిన విద్యార్థులతో ఎస్సై రాజు

పోలీసుల ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

దహెగాం, న్యూస్‌టుడే : విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని ఎస్సై కందూరి రాజు సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా.. మంగళవారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో చురుకుగా పాల్గొని మేధాశక్తిని పెంచుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం..

వాంకిడి, న్యూస్‌టుడే: మండలంలోని ఖనర్ గ్రామానికి చెందిన వాడై శారద అనే గర్భిణికి సోమవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే 108కి సమాచారం అందించారు. గ్రామానికి 108 సిబ్బంది వెళ్లి ప్రసవ వేదన భరిస్తున్న గర్భిణిని వాహనంలో వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మగ బిడ్డను ప్రసవించింది. 108 టెక్నీషియన్ నేరెళ్ల శంకర్ చాకచక్యంగా వ్యవహరించి ప్రసవం చేశారు. తల్లీ బిడ్డను వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టెక్నీషియన్, పైలట్ నాగార్జునులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


తల్లికి బిడ్డను అందజేస్తున్న టెక్నీషియన్ శంకర్


సాయి శ్రద్ధను సన్మానిస్తున్న ఆదివాసీ ప్రధాన సంఘం నాయకులు

సన్మానించి.. చేయూతనందించి

జైనూర్, న్యూస్‌టుడే: మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోని నిరుపేద కుటుంబంలో జన్మించిన సాయిశ్రద్ధ అనే విద్యార్థి నీట్ పరీక్షలో సీటు సాధించడం ఆదివాసీ సమాజానికి గర్వకారణమని ఆదివాసీ ప్రధాన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా.మేస్రం మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సాయి శ్రద్ధకు సన్మానించి రూ.26 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా సీఐ రమేష్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. చదువుకు పేదరికం అడ్డు కాదనడానికి ఈ విద్యార్థే నిదర్శనమన్నారు. ఆదివాసీ విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సై సాగర్, సంఘం జిల్లా కార్యదర్శి ఆడ నగేష్, రాష్ట్ర కార్యదర్శులు గోవింద్‌రావ్, శ్రీనివాస్ సాయి కృష్ణ, శ్యామ్‌సుందర్, తదితరులున్నారు

విద్యుత్తు లేక.. నీటి కోసం పాట్లు!


నీరు లేక ఎండిపోతున్న వరి పొలం


వడలిపోతున్న పామాయిల్ మొక్కలు

మండలంలోని కుంచవెల్లి గ్రామ సమీప పొలాలకు విద్యుత్తు సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన నియంత్రిక చెడిపోయి పది రోజులవుతోంది. అప్పటి నుంచి విద్యుత్తు సరఫరా లేక పామాయిల్, వరి పొలాలు ఎండిపోతున్నాయని రౌతు రాజన్న అనే రైతు వాపోతున్నారు. సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఈ నియంత్రిక కింద పదెకరాల్లో పామాయిల్, 15 ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. వరి పొట్టదశలో ఉందని ఎండిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నియంత్రిక ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.
- **న్యూస్‌టుడే, దహెగాం**

సెల్ఫీ వీడియో తీసుకుని.. రైలు కిందపడి బలవన్మరణం

తాంసి, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం తాంసి మండలంలో చోటుచేసుకుంది. పొన్నారికి చెందిన గుమ్ముల దేవన్న(30) కొంతకాలంగా మద్యానికి బానిసై, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. భార్య సైతం పుట్టింటి నుంచి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. మంగళవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో మద్యం తాగి, హస్నాపూర్ సమీపంలోని రైలు పట్టాల వైపు వెళ్లాడు. చావుకు దగ్గరలో ఉన్నా.. మరో అరగంటలో ఆత్మహత్య చేసుకుంటున్నాను. స్థలం ఇదేనంటూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. 11 గంటలకు మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ వస్తున్న ఇంటర్‌సిటీ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య, కూతురు ఉంది.